

మహాకవి శ్రీశ్రీ
వర్ధంతి సభలో వక్తలు

ప్రజాశక్తి - చింతలపూడి

తెలుగు సాహిత్యం, చలనచిత్రాల్లో తన రచనలకు ప్రసిద్ధి చెందిన భారతీయ కవి, గేయ రచయిత మహాకవి శ్రీశ్రీ అని మారుమూడి తామస్, నిమ్మగడ్డ అశోక్ అన్నారు. పట్టణంలోని ప్రజాసంఘాల కార్యాలయం వద్ద మహాకవి శ్రీశ్రీ 41 వర్ధంతి కార్యక్రమాన్ని ఎస్‌డి.రసూల్ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీశ్రీ చిత్రపటానికి మహిళా సంఘం నాయకులు ఎం.వరలక్ష్మీదేవి, కె.అనురాధ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం చింతలపూడి కవిరత్న మల్లెల జయరాజు, కార్యక్రమ నిర్వాహకులు ఎస్.సూర్యకుమార్ శ్రీ శ్రీ రచించిన గేయాలను ఆ గేయాల్లో శ్రామిక వర్గ విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో పాకా సర్వేశ్వరరావు, కక్కిర్యాల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రైతు 'చింత' తీరేనా..!

- చింతలపూడి ఎత్తిపోతల బాధిత రైతుల పరిస్థితి అగమ్యగోచరం
- భూములకు న్యాయమైన పరిహారం కోసం అలుపెరగని పోరాటం
- పట్టించుకోని గత ప్రభుత్వం - కొత్త సర్కార్ రాకతో రైతుల్లో మళ్లీ ఆశలు
- భూములను బ్లాక్‌లిస్టులో పెట్టడంతో తీవ్ర ఇబ్బందుల్లో రైతులు
- తమకు న్యాయం చేసి ప్రాజెక్టు పూర్తి చేయాలని వేడుకోలు



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

చింతలపూడి ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోతున్న బాధిత రైతులకు ఇప్పటికైనా న్యాయం జరిగేనా అనే చర్చ సర్వత్రా సాగుతోంది. చింతలపూడి బాధిత రైతులకు న్యాయం చేస్తామని 2019 ఎన్నికల్లో హామీ ఇచ్చిన వైసిపి అధికారంలోకి వచ్చాక పట్టించుకున్న దాఖలాల్లేవు. ఎంపీగాని, ఎంఎల్‌ఎగాని రైతులతో కూర్చుని మాట్లాడిన పరిస్థితీ లేకుండాపోయింది. చింతలపూడి ప్రాజెక్టులో భాగంగా కాలువ తవ్వకాల కోసం సేకరిస్తున్న భూములకు న్యాయమైన పరిహారం ఇవ్వాలని ఏళ్ల తరబడి రైతులు తమ పోరాటం సాగిస్తూనే ఉన్నారు. ఇప్పటికీ న్యాయం జరగని పరిస్థితి నెలకొంది. జిల్లాలో అత్యంత ముఖ్యమైన సాగునీటి ప్రాజెక్టుల్లో చింతలపూడి ఎత్తిపోతల పథకం ప్రధానమైంది. 2008లో చింతలపూడి ప్రాజెక్టును రూ.1,701 కోట్ల అంచనా వ్యయంతో ప్రారంభించారు. 2014లో టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 4.80 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేలా ఈ ప్రాజెక్టును కృష్ణా జిల్లాకు విస్తరించింది. అందుకుగాను రూ.4,909 కోట్లు ఖర్చు కానున్నట్లు అంచనా వేశారు. ఇప్పటికీ భూసేకరణ పూర్తికాని పరిస్థితి నెలకొంది. దీనికి ప్రధాన కారణం ఒక్కటే. బహిరంగ మార్కెట్లో ఉన్న ధరకు, ప్రభుత్వం రైతులకు ఇస్తామని చెప్పిన ధరకు పొంతన లేకపోవడమే. అప్పట్లోనే బహిరంగ మార్కెట్లో ఎకరా భూమి రూ.30 లక్షలకుపైగా పలుకుతుండగా ప్రభుత్వం నిర్ణయించిన ధర రూ.12.50 లక్షలు మాత్రమే. ఎకరా పొలం కోల్పోయిన రైతులు ప్రభుత్వం ఇచ్చే సొమ్ముతో అర ఎకరా సైతం కొనలేని పరిస్థితి నెలకొంది. అప్పట్లో పట్టిసీమ ప్రాజెక్టుకు భూములిచ్చిన రైతులకు ప్రభుత్వం రూ.30 లక్షల నుంచి రూ.50 లక్షల వరకూ పరిహారం ఇచ్చారు. పట్టిసీమ ప్రాజెక్టులో రైతులకు ఇచ్చినట్లుగా తమకూ ఎకరాకు రూ.30 లక్షలు పరిహారం ఇవ్వాలని రైతులు ఆందోళన బాట పట్టారు. ప్రభుత్వం విన్పించుకోలేదు. దీంతో కాలువల తవ్వకాలు ఆగిపోయాయి. బలవంతంగా తవ్వకాలు సాగించేందుకు అధికారులు ప్రయత్నించినప్పటికీ రైతులు అడ్డుకున్నారు. 2019 ఎన్నికల పర్యటనలో భాగంగా చింతలపూడి వచ్చిన వైసిపి అధ్యక్షుడు జగన్ తాము అధికారంలోకి వచ్చాక చింతలపూడి రైతులకు న్యాయం చేస్తామని ప్రకటించారు. గడిచిన ఐదేళ్లలో పట్టించుకున్న దాఖలాల్లేవు. దీంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ప్రభుత్వం సేకరించిన భూములను బ్లాక్‌లిస్టులో పెట్టింది. దీంతో బ్యాంకులు పంట రుణాలు ఇవ్వడం లేదు. భూములు అమ్ముకోవడానికి వీల్లేకుండాపోయింది. దీంతో పిల్లల వివాహాలకు, చదువులకు, ఆరోగ్య సమస్యలకు సంబంధించిన ఖర్చుల కోసం భూములు అమ్ముకునేందుకు సైతం వీల్లేకపోవడంతో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. చింతలపూడి, లింగపాలెం, కామవరపుకోట మండలాల్లో బాధిత రైతులు పెద్దఎత్తున ఉన్నారు. కొత్త ప్రభుత్వం కొలువుదీరడంతో రైతుల్లో కొత్త ఆశలు చిగురించాయి. జిల్లాకు చెందిన పాలకొల్లు ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు ఇరిగేషన్ మంత్రిగా ఉన్నారు. ఇప్పటికైనా తమ భూములకు న్యాయమైన పరిహారం ఇచ్చి ప్రాజెక్టు పనులు పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు. ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని కృత నిశ్చయంతో ముందుకు సాగాలని నిర్ణయించింది. చింతలపూడి రైతులకు న్యాయమైన పరిహారం అందిస్తే ప్రాజెక్టుకు ఉన్న అడ్డంకులు తొలగిపోతాయి.

చింతలపూడి బాధిత రైతులకు న్యాయం చేయాలి
కె.శ్రీనివాస్, రైతుసంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి

మార్కెట్ విలువ ప్రకారం పరిహారం చెల్లించి చింతలపూడి ఎత్తిపోతల ప్రాజెక్టు రైతులకు న్యాయం చేయాలి. గత వైసిపి ప్రభుత్వం రైతుల గోడును పట్టించుకోకుండా వదిలేసింది. ఏళ్ల తరబడి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైతుల సమస్యలను పరిష్కరించి ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం.



కొత్త పట్టిసీమలో సచివాలయం వద్ద ఇంటిపై కూలిన భారీ వృక్షం


ఈదురుగాలులు, భారీ వర్షం
భారీ వృక్షాలు కూలి వాహనాల రాకపోకలకు అంతరాయం

ప్రజాశక్తి - పోలవరం

మండలంలో శనివారం సాయంత్రం ఈదురుగాలులతో భారీ వర్షం కురిసింది. ఈ గాలులకు పట్టిసీమ నుండి కొవ్వూరు వెళ్లే మార్గంలో, కన్నాపురం అడ్డ రోడ్డు నుండి దొండపూడి వెళ్లే రోడ్డు మార్గంలో భారీ వృక్షాలు నేలకూలాయి. దీంతో ఆయా మార్గాల్లో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. ఆర్‌టిసి బస్సులు, ఆటోలు, ఇతర వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పట్టిసీమ గ్రామస్తులు స్వచ్ఛందంగా చెట్లను తొలగించి రాకపోకలు పునరుద్ధరించారు. కొత్త పట్టిసీమ సచివాలయ సమీపంలో ఇంటిపై ఒక భారీ వృక్షం కూలింది. అయితే ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు.

రేపు సిఎం చంద్రబాబు పోలవరం రాక!

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి



సిఎం చంద్రబాబు పదవీ బాధ్యతలు చేపట్టాక తొలిసారి జిల్లాకు రానున్నారు. ఆయన ఈ నెల 17న సోమవారం పోలవరం ప్రాజెక్టు సందర్శనకు రానున్నట్లు జిల్లా అధికారులకు సమాచారం అందింది. చంద్రబాబు కూడా తన క్షేత్రస్థాయి పర్యటనలు పోలవరం నుంచే ప్రారంభిస్తానని ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే ఆయన పర్యటనకు సంబంధించి పూర్తి స్థాయి వివరాలు వెల్లడికావాల్సి ఉంది. నత్తనడకన సాగుతున్న పోలవరం పనులు వేగవంతం చేసేందుకు ఆయన ప్రాజెక్టును సందర్శించనున్నారు. గతంలో చంద్రబాబు సిఎంగా ఉన్న చంద్రబాబు ప్రతిసోమవారం పోల వరం పనులపై సమీక్ష నిర్వహించడం, నెలకోసారి ప్రాజెక్టును సందర్శించడం వంటివి చేసేవారు. ఈసారీ అదేరీతిలో చంద్రబాబు ముందుకు సాగనున్నారని తెలుస్తోంది. ప్రాజెక్టు పనులపై ఎక్కువ దృష్టి సారించిన చంద్రబాబు నిర్వాసితుల సమస్యలు, పునరావాసం అంశాలు పెద్దగా పట్టించుకోలేదనే విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలో ఈసారి ప్రాజెక్టు పనులతోపాటు నిర్వాసితుల అంశం కూడా పట్టించుకుంటారో, లేదో వేచిచూడాలి.

దున్నేవానికే భూమి హక్కు

అందుకోసం బలమైన రైతాంగ ఉద్యమం సాగాలి


రైతు కూలీ సంఘం రాష్ట్ర మహాసభలో ఎఐకెఎంకెఎస్ కన్వీనర్ సుభోధ్‌మిత్రా



రైతు కూలీ సంఘం రాష్ట్ర మహాసభలో భాగంగా ప్రదర్శన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

'దున్నేవానికి భూమి హక్కు' నినాదంగా దేశంలో బలమైన రైతాంగ ఉద్యమం సాగాలని ఎఐకెఎంకెఎస్ కన్వీనర్ సుభోధ్‌మిత్రా పిలుపునిచ్చారు. భూమి సమస్య ప్రధానమైందని, దాని పరిష్కారంతోనే ప్రజల సమగ్ర వికాసం ముడిపడి ఉందని అన్నారు. ఎఐకెఎంఎస్ అనుబంధ రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) రాష్ట్ర మహాసభ ప్రారంభ సభ శనివారం టుబాకో మర్చంట్స్ అసోసియేషన్ హాలు(అల్లూరి సీతారామరాజు ప్రాంగణం)లో జరిగింది. తొలుత సంఘ పతాకాన్ని సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు సింహాద్రి ఝాన్సీ ఆవిష్కరించారు. రాష్ట్ర కార్యదర్శి ఎంఎస్.నాగరాజు వక్తలను వేదికపై ఆహ్వానించారు. ఝాన్సీ అధ్యక్షతన జరిగిన సభలో మహాసభ ఆహ్వాన సంఘం అధ్యక్షులు డాక్టర్ రావి గోపాలకష్ణయ్య మాట్లాడుతూ 1937 జులైలో ఇచ్ఛాపురం నుండి మద్రాస్ వరకు సాగించిన రైతు రక్షణ యాత్రకు నాయకత్వం వహించిన పశ్చిమగోదావరి జిల్లా నాయకులు కొమ్మారెడ్డి సత్యనారాయణ, చలసాని వాసుదేవరావులను గుర్తు చేశారు. ఆ పోరాట వారసత్వాన్ని కొనసాగించాలని ఆకాంక్షించారు. రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి దంతులూరి వర్మ సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. అన ంతరం సుభోధ్‌మిత్రా మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో మూడు వేల గ్రామాలను భూస్వాముల పీడన నుండి విముక్తి చేసి, పది లక్షల ఎకరాల భూములను గ్రామీణ పేదలకు పంపిణీ చేసుకున్నారన్నారు. పాలకుల రైతాంగ, ఆదివాసీ వ్యతిరేక విధానాలపై అవిశ్రాంత పోరాటానికి సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎంఎల్‌సి పాకలపాటి రఘువర్మ మాట్లాడుతూ రైతులు హక్కులు సాధించుకోవడానికి ప్రాణాలైనా అర్పించి పోరాటాలను సాగించాలన్నారు. సభలో ఎఐఎఫ్‌టియు (న్యూ) జాతీయ అధ్యక్షులు గుర్రం విజయ్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి జె.కిషోర్‌బాబు, ఎఐకెఎంకెఎస్ ఒడిశ్శా నాయకులు శ్రీకాంత్ మొహంతి, తెలంగాణ నాయకులు ప్రసాదన్న, కర్నాటక నాయకులు చాగనూరు మల్లికార్జునరెడ్డి, మహిళా సామాజిక ఉద్యమకారిణి సంకు మనోరమ ప్రసంగించారు. సభ ప్రారంభంలో ఆదివాసీ, ప్రజా కళాకారుల కోలాటం, డప్పు నృత్యం, పాటలు ఆకట్టుకున్నాయి.



సభకు హాజరైన జనం

భారీ ప్రదర్శన, బహిరంగ సభ

నగరంలో వందలాది మంది రైతుకూలీలు, ఆదివాసీలతో శనివారం సాయంత్రం భారీ ప్రదర్శన నిర్వహించారు. టుబాకో మర్చంట్స్ అసోసియేషన్ హాల్ నుంచి ప్రారంభమైన ప్రదర్శన ఫ్లైఓవర్, కెనాల్ రోడ్, అంబికా సెంటర్, గోల్డ్ బజార్ మీదుగా మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభ వేదిక వద్దకు చేరుకుంది. ప్రదర్శనకు ముందు భాగాన ఆదివాసీల సాంప్రదాయిక 'కిందిరి' నృత్యం, డప్పు నృత్యాలు ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం మున్సిపల్ కార్యాలయం వద్ద సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎంఎస్.నాగరాజు అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో ప్రజా కళాకారులు 'నెత్తుటి దీపాలు' నృత్య రూపకాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షురాలు సింహాద్రి ఝాన్సీ మాట్లాడుతూ కార్మిక, విద్యార్థి, మేధావులు, ప్రజాస్వామిక వాదులు రైతాంగం కలిసి ఉద్యమాలు సాగించాల్సిన అవసరం ఉందన్నారు. ఎఐఎఫ్‌టియు (న్యూ) రాష్ట్ర కార్యదర్శి జె.కిషోర్‌బాబు మాట్లాడుతూ కార్మికులు, రైతులు ఐక్యంగా రానున్న కాలంలో మరిన్ని పోరాటాలకు సంసిద్ధం కావాలన్నారు. స్త్రీ విముక్తి సంఘటన రాష్ట్ర అధ్యక్షురాలు చల్లపల్లి విజయ మాట్లాడుతూ రైతుకూలీ, పేద మహిళలపై గ్రామీణ ప్రాంతాల్లో భూస్వామ్య, పెత్తందారీ శక్తులు సాగిస్తున్న అత్యాచారాలు, దాడులను తీవ్రంగా ఖండించారు. సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి డి.వర్మ, వివిధ రాష్ట్రాల నేతలు ప్రసాదన్న, అశోక్ బైతా, ఎ.సురేష్, ఏజెన్సీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కుంజం రామారావు, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ పాల్గొని ప్రసంగించారు.

సెట్‌వెల్ ఆధ్వర్యాన జాబ్‌మేళా

ఏలూరు టౌన్ :జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయం, నేషనల్ కెరీర్ సర్వీసు (ఎన్‌సిఎస్), ఎపి యువజన సర్వీసుల శాఖ, సెట్‌వెల్-ఏలూరు సంయుక్త ఆధ్వర్యంలో శనివారం సెట్‌వెల్ కార్యాలయ ఆవరణలో జాబ్‌మేళా నిర్వహించారు. దీనిలో స్పందన స్ఫూర్తి ఫైనాన్స్, మోహన్ స్పింటేక్స్, ఎస్‌బిఐ లిఫ్ లిమిటెడ్, సెల్కాట్ మొబైల్స్ కంపెనీల నుండి ప్రతినిధులు పాల్గొన్నారు. 205 మంది నిరుద్యోగులు హాజరయ్యారని జిల్లా ఉపాధి కల్పనాధికారి మధుభూషణరావు, సెట్‌వెల్ సిఇఒ ఎమ్‌డి హెచ్.మెహ్రాజ్ తెలిపారు. 62 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారని చెప్పారు. కార్యక్రమంలో నేషనల్ కెరీర్ సర్వీసు జిల్లా కోఆర్డినేటర్ జి.ప్రవీణ్‌కృష్ణ, ఇఒ వెకేషనల్ గైడెన్స్ కోర్స్ వి.వరలక్ష్మి, సెట్‌వెల్ మేనేజర్ పివిఎన్.సత్యనారాయణ, పర్యవేక్షకులు కెజె.కెన్నెడీ, పసుపులేటి ప్రసాద్ పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా తనిఖీలు ముమ్మరం
ఎస్‌పి మేరీ ప్రశాంతి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

నాటుసారా, గంజాయి అక్రమ రవాణా, మానవ అక్రమ రవాణా వంటి వాటిని అరికట్టేందుకు జిల్లా వ్యాప్తంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌పి మేరీ ప్రశాంతి తెలిపారు. ఎస్‌పి ఆదేశాల మేరకు పోలీసులు రాత్రి వేళ తనిఖీలు ముమ్మరం చేశారు. శనివారం తెల్లవారుజామున జాతీయ రహదారి పరిధిలో ఉన్న పోలీసులు వాహనాలు తనిఖీ చేశారు. ఏలూరు, పోల వరం, నూజివీడు, జంగారెడ్డిగూడెం సబ్ డివిజన్ల పరిధి లో రాత్రిపూట గస్తీ పెంచారు. రాత్రివేళ బస్‌స్టేషన్లు, రైల్వే స్టేషన్లలో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తులను విచారించారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన అవసరం
సహాయ మలేరియా నివారణ అధికారి గోవిందరావు

భీమడోలు :సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలని, వాటిని అదుపు చేసే క్రమంలో అప్రమత్తంగా వ్యవహరించాలని సహాయ మలేరియా నివారణ అధికారి గోవిందరావు కోరారు. గుండుగొలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు శ్రీ లక్ష్మి, జాహ్నవి సంయుక్త ఆధ్వర్యంలో శనివారం మలేరియా వ్యతిరేక మాసోత్సవ కార్యక్రమాలను నిర్వహించారు. దీనిలో భాగంగా ఆరోగ్య కేంద్ర పరిధిలోని భీమడోలు హెల్త్, వెల్త్ కేంద్రం వద్ద ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సహాయ మలేరియా నివారణ అధికారి మాట్లాడుతూ ప్రతి కుటుంబం శుక్రవారం డ్రై డే హెల్త్ డే కార్యక్రమాన్ని పాటించాలని కోరారు. మలేరియా వ్యాధి లక్షణాలు కనపడగానే ఆరోగ్య కేంద్రాల వద్ద, హెల్త్, వెల్త్ కేంద్రాల వద్ద మలేరియా, డెంగీ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని కోరారు. వాటిని ఉచితంగా చేస్తున్నారని తెలిపారు. వ్యాధిగ్రస్తులను ఆదుకునేందుకు మందులతో పాటు వైద్యులు ఇతర సిబ్బంది అందుబాటులో ఉన్నారని తెలిపారు. ర్యాలీ సందర్భంగా ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్నా మన్నారు. కరపత్రాల పంపిణీ చేపట్టామన్నారు. దోమల నివారణకు మురుగు కాలువల్లో ఎబేట్ ద్రావణాన్ని పిచికారీ చేశామని చెప్పారు. ఇదే క్రమంలో గ్రామపంచాయతీ పరిధిలోని ఐదు ప్రభుత్వ విద్యార్థుల వసతి గృహాల వద్ద దోమల నివారణకు, నియంత్రణకు తగు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం సిబ్బంది అధికారులు పాల్గొన్నారు.



కంకర తవ్వకాలు జరిపిన ప్రదేశం

ప్రభుత్వ భూమిలో కంకర అక్రమ తవ్వకాలు

ప్రజాశక్తి - ఉంగుటూరు

చేబ్రోలు-తిమ్మయ్యపాలెం మార్గంలో తిమ్మయ్యపాలెం రెవెన్యూ పరిధికి చెందిన ప్రభుత్వ భూమిని ఆక్రమించి అందులో రాత్రివేళల్లో కంకర తవ్వి తరలిస్తున్నారని స్థానికులు ఫిర్యాదు చేశారు. కంకర తవ్వకాలపై ఎప్పటికప్పుడు అధికారులకు సమాచారం ఇచ్చినా, ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా మట్టి, కంకర తవ్వకాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయం తన దృష్టికి రాలేదని, క్షేత్రస్థాయిలో పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని విఆర్‌ఒ టేకి దుర్గా ప్రసాద్ తెలిపారు.

మొరాయించిన ఆర్‌టిసి బస్సు
ప్రయాణికుల ఇబ్బందులు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్



మరమ్మతులకు గురైన బస్సు

సాంకేతిక లోపంతో ఆర్‌టిసి బస్సు ఆగిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదు ర్కొన్నారు. జం గారెడ్డిగూడెం డిపోకు చెందిన బస్సులు తరచూ ఆగిపోతున్నా అధికారులు పట్టి ంచుకోవ డంలేదని ప్రయాణికులు ఆగ్ర హం వ్యక్తం చేస్తున్నారు. జంగారెడ్డిగూడెం డిపోకు చెందిన బస్సు శనివారం అక్కడి నుంచి ఏలూరుకు బయలుదేరింది. ఈ క్రమంలో మండలంలోని పుట్లగట్లగూడెం గ్రామానికి వచ్చేసరికి సాంకేతిక లోపంతో ఆగిపోయింది. దీంతో బస్సులోని ప్రయాణికులు ఎండలో అవస్థలు పడ్డారు. తమ గమ్యస్థానాలకు చేరుకునేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. జంగారెడ్డిగూడెం డిపోకు చెందిన బస్సులు తరచూ ఎక్కడబడితే అక్కడ ఆగిపోతున్నాయని ప్రయాణికులు చెబుతున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బస్సులు పర్యవేక్షణ లేకపోవడమే ఇందుకు కారణమంటున్నారు. ఇలా ఆగిపోతే అత్యవసర పనులు ఉన్నవారి పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్సులకు మరమ్మతులు చేయించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

విద్యార్థుల బస్సుల తనిఖీలు
డిటిసి ఎస్.శాంతకుమారి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

పాఠశాలలు పున:ప్రారంభమైన నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా పాఠశాల బస్సుల తనిఖీలు నిర్వహిస్తున్నామని జిల్లా ఉప రవాణా కమిషనర్ ఎస్.శాంతకుమారి తెలిపారు. జిల్లావ్యాప్తంగా 869 విద్యాసంస్థల బస్సులున్నాయని తెలిపారు. వాటిలో ఫిట్‌నెస్ పరీక్షలను పూర్తి చేసుకున్న బస్సులు 682 అని, ఇంకా 187 బస్సుల ఫిట్‌నెస్ పరీక్షలు పూర్తి చేసుకోలేదన్నారు. ఈ నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలను చేపట్టామన్నారు. ఈ తనిఖీల్లో బస్సుల పత్రాల్లో ఏమైనా తేడాలుంటే కేసు నమోదు చేస్తామని, అవసరమైతే వాహనాన్ని సీజ్ చేస్తామని డిటిసి శాంతకుమార్ తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా పాఠశాల బస్సులను నడిపితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. డ్రైవర్లు ఎంతో జాగ్రత్తగా పాఠశాల వాహనాలను నడపాలని ఆమె సూచించారు ప్రత్యేకంగా తర్ఫీదు పొందిన డ్రైవర్లను మాత్రమే పాఠశాల బస్సులను నడిపేందుకు ఉపయోగించాలని యాజమాన్యాలకు సూచించారు. డ్రైవర్లకు లైసెన్స్ లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లావ్యాప్తంగా ప్రత్యేక తనిఖీల్లో పలువురు రవాణా అధికారులు పాల్గొన్నారు.

అటవీ విస్తీర్ణాన్ని పెంచాలి
జిల్లా అటవీ శాఖాధికారి రవీంద్ర ధామా


ప్రజాశక్తి - జీలుగుమిల్లి

అటవీ శాఖ విస్తీర్ణాన్ని పెంచాలని జిల్లా అటవీ శాఖాధికారి రవీంద్రధామా తెలిపారు. శనివారం జీలుగుమిల్లి బీట్ రామన్నపాలెం విఎస్‌ఎస్ పరిధిలోని చంద్రమ్మ కాలనీ అటవీ ప్రాంతంలో రెండు సంవత్సరాల క్రితం నాటిన మొక్కలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ప్లాంటేషన్‌లోని మొక్కలు సజావుగా పెరుగుతుండటంతో సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రవీంద్ర ధామా మాట్లాడుతూ అటవీశాఖ పరిధిలో ఉన్న ప్లాంటేషన్‌లను వృద్ధి చేసి అటవీశాఖను విస్తరింపజేయాలన్నారు. అనంతరం నూతన ప్లాంటేషన్లకు అటవీ శాఖ భూములను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సబ్ డిఎఫ్‌ఒ వెంకట సుబ్బయ్య, జంగారెడ్డిగూడెం ఫారెస్ట్ రేంజ్ అధికారి ఎస్‌కె.వలీ, సెక్షన్ అధికారి దినేష్, డిఆర్‌ఒ నాగేశ్వరావు, బీట్ అధికార్లు మారేష్, ఏసు పండు, అటవీ శాఖ సిబ్బంది రాఘవులు, రహమత్ పాల్గొన్నారు.



మొక్కలను పరిశీలిస్తున్న రవీంద్రధామా

త్వరలో సబ్ ఛానల్ కాలువ అభివృద్ధి పనులు
ఇరిగేషన్ డిఇ సత్యనారాయణ, ఇఇ రంగయ్య



గుడిపాడు సబ్ ఛానల్‌ను పరిశీలిస్తున్న ఇరిగేషన్ అధికారులు

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని గుడిపాడు సబ్ ఛానల్ కాలువ అభివృద్ధి పనులు ప్రారంభిస్తామని ఇరిగేషన్ డిఇ సత్యనారాయణ, ఇఇ రంగయ్య తెలిపారు. ఈ మేరకు వారు సబ్ ఛానల్‌ను శనివారం పరిశీలించారు. మండలంలోని గుడిపాడు, గుళ్లపూడి, వలసపల్లి గ్రామాలకు ఆయకట్టుకు చెందిన తమ్మిలేరు నుంచి వచ్చే సబ్ ఛానల్ ఐదేళ్లుగా వైసిపి హయాంలో ఎటువంటి పనులు చేయలేదని ఆయా గ్రామస్తులు తెలిపారు. దీంతో సబ్ ఛానల్ ద్వారా చెరువులకు సరిగా నీరు అందకపోవటంతో ఆయా గ్రామస్తులు మంత్రి కొలుసు పార్థసారధి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి సంబంధిత అధికారులకు ఫోన్ చేసి వెంటనే వెళ్లి అక్కడ సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ మేరకు డిఇ సత్యనారాయణ, ఇఇ రంగయ్య సబ్ ఛానల్ శనివారం పరిశీలించారు. ఎస్టిమేషన్ వేసి త్వరలోనే కాలువ పనులను ప్రారంభిస్తామని చెప్పారు. మూడు గ్రామాల రైతులు మంత్రి పార్థసారధికి కృతజ్ఞతలు తెలిపారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపిస్తే సహించం

- విద్యార్థులకు సంపూర్ణ ఆహారం అందించాలి
- సర్వసభ్య సమావేశంలో ఎంపిపి వెంకటరెడ్డి
- పలు శాఖల అధికారుల గైర్హాజరుపై ఆగ్రహం

ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పెట్టే మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపిస్తే సహించేది లేదని ఎంపిపి సుంకర వెంకటరెడ్డి హెచ్చరించారు. ఎటువంటి నాణ్యత లోపం లేకుండా సంపూర్ణమైన ఆహారాన్ని పిల్లలకు పెట్టాలన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ జి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎంపిపి సుంకర వెంకటరెడ్డి అధ్యక్షతన శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన కొన్ని శాఖల అధికారులు వారి శాఖల పనుల పురోగతిని వివరించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ మూడు నెలలకోసారి జరిగే సమావేశానికి ప్రభుత్వ శాఖాధికారులు హాజరు కాకుండా బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నారన్నారు. మండల సమావేశానికి ప్రభుత్వ శాఖల అధికారులు హాజరు కాకపోతే మండలంలోని సమస్యలు ఎలా పరిష్కారమవుతాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ అంతరాయం పట్ల ప్రజలు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. విద్యుత్ వినియోగానికి సంబంధించి పరిమితి పెంచే విధంగా విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి ప్రజలు ఇబ్బంది పడకుండా విద్యుత్ అందించాలని ఎఇకి తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నపిల్లలు ఫ్యాన్లు లేక చాలా ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే అన్ని కేంద్రాల్లో ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని ఐసిడిఎస్ పిఒకు చెప్పారు. పోలవరం పంచాయతీ పరిధిలోని కమ్మరగూడెం, బిసి కాలనీలో మంజూరైన కల్వర్టులను వెంటనే నిర్మించాలని కార్యదర్శి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇలకు సూచించారు. గూటాల గ్రామపంచాయతీలో అభివృద్ధి అనేది ఎక్కడా లేదని, డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానంగా ఉందని కార్యదర్శిని ప్రశ్నించారు. ఇంటి పన్నుల వివరాలు, విడుదలైన గ్రాంట్లు, లావాదేవీల నివేదికలను సమర్పించాలన్నారు. మళ్లీ జరగబోయే సర్వసభ్య సమావేశానికి ఈ సమావేశంలో తీర్మానించిన సమస్యలకు పరిష్కారం చూపాలని ఎంపిడిఒ జి.శ్రీనుకు, హాజరైన శాఖల అధికారులకు ఎంపిపి సూచించారు. నూతనంగా కొలువుతీరిన ప్రభుత్వ నియమ నిబంధనలను అనుసరిస్తూ మండలం, పంచాయతీల పురోగతికి కృషి చేసే విధంగా సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ, ఆర్‌డబ్ల్యూఎస్ డిఇ, ఇఒపిఆర్‌డి, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, రెవెన్యూ, పంచాయతీ, విద్యుత్, విద్య, అటవీ, వెలుగు, వ్యవసాయ, మాతా శిశు సంక్షేమ, ఆర్‌డబ్ల్యూఎస్, ఆర్‌అండ్‌బి, పోలీస్, పిడబ్ల్యుసి, నీటి పారుదల, ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎస్, పలు శాఖల అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో చిన్నారులు, హెచ్ఎం, అంగన్‌వాడీలు

అంగన్‌వాడీ కేంద్రాల్లో గ్రాడ్యుయేషన్ డే

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

ఐసిడిఎస్ కొయ్యలగూడెం ప్రాజెక్టు పరిధిలో మండలంలోని అంకలగూడెం గ్రామంలో శనివారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఐదేళ్లు నిండిన ప్రీ స్కూల్ పిల్లలకు, ప్రీ స్కూల్ గ్రాడ్యుయేషన్ నిర్వహించారు. గ్రామంలో మూడు అంగన్వాడీ కేంద్రాల్లో పది మంది పిల్లలు, ఒకటో తరగతిలో ప్రమోట్ అయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం సత్యనారాయణ, సెక్టార్ సూపర్‌వైజర్ నయొమిరాణి, అంగన్వాడీ టీచర్ శివ రత్న కుమారి, జయప్రద, గంగాదేవి పాల్గొన్నారు.

ఎంఎల్ఎ కామినేనికి ఎంపీ మహేష్ పరామర్శ

ప్రజాశక్తి - కైకలూరు

కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఎంఎల్ఎ కామినేని శ్రీనివాస్‌ను ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్ కైకలూరు నాయకులతో కలిసి పరామర్శించారు. శనివారం హైదరాబాద్‌లో కామినేని నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పరామర్శించారు. ఈ నెల 17,18,19 తేదీల్లో కైకలూరులో ప్రజలకు అందుబాటులో ఉంటున్నట్లు కామినేని చెప్పారు. ఎంపీతో పాటు బికెఎం నాని, రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వహణ కార్యదర్శి పూల రామచంద్రరావు, వరహపట్నం మాజీ సర్పంచి బోయిన శ్రీనివాస్, వెంకటాపురం మాజీ సర్పంచి కరేటి శ్రీహరి ఉన్నారు.

'ఫ్లెక్సీల ధ్వంసం దుర్మార్గం'

ప్రజాశక్తి - టి.నరసాపురం

తాము ఏర్పాటు చేసుకున్న ఫ్లెక్సీలను వైసిపి నాయకులు ధ్వంసం చేశారని కూటమి నాయకులు అన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి కూటమి గెలుపొందగా మండలంలోని మల్లుకుంట గ్రామంలో కూటమి నాయకులు గ్రామంలో ఐదు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. వాటిని వైసిపికి చెందిన కొందరు చించి వేశారని ఆరోపిస్తూ శనివారం గ్రామంలో కూటమి నేతలు విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపిపి శీలం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కూటమి గెలుపుతో సంతోషంగా ఏర్పాటు చేసుకున్న ఫ్లెక్సీలు ధ్వంసం చేయడం దుర్మార్గపు చర్య అన్నారు. కూటమి గెలుపు ఓర్వలేక వైసిపి నాయకులు ఫ్లెక్సీలు ధ్వంసం చేశారన్నారు. గ్రామీణ వాతావరణంలో అన్ని సామాజిక తరగతుల మధ్య మంచి వాతావరణం కల్పించాలని తెలిపారు. ఎన్నికల సమయంలో ఎవరి పార్టీలు వారివే అనంతరం అందరూ ఒకటేన్నారు. ఫ్లెక్సీలు ధ్వంసం చేసినవారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పేరుబోయిన శ్రీనివాస్, తోట లక్ష్మీనారాయణ, కాళ్ళీడి రాంబాబు, గండబోయిన శ్రీను, జోనుబోయిన సోంబాబు పాల్గొన్నారు.

గన్నికి ధర్మరాజు పుట్టినరోజు శుభాకాంక్షలు

ప్రజాశక్తి - ఉంగుటూరు

టిడిపి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంఎల్ఎ గన్ని వీరాంజనేయులు పుట్టినరోజు వేడుకలు శనివారం భీమడోలులో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఎంఎల్ఎ ధర్మరాజు పాల్గొని పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. దుశ్శాలువ కప్పి సత్కరించారు. ఉంగుటూరు మండలంలో టిడిపి కార్యకర్తలు, గన్ని అభిమానులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ రుణాలు ఇవ్వాలి

ప్రజాశక్తి - చింతలపూడి

ఎస్‌సి, ఎస్‌టి కార్పొరేషన్ రుణాలు ఇచ్చి నిరుద్యోగ యువతను ఆదుకోవాలని అఖిలభారత గిరిజన ఉద్యోగుల సంఘం ఏలూరు జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు గోపాలకృష్ణ నాయక్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడటం ఆనందంగా ఉందని, కొత్త ప్రభుత్వాన్ని ఆంధ్ర రాష్ట్ర ప్రజలు ఆస్వాదిస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు, పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా పవన్‌కళ్యాణ్, మానవ వనరుల శాఖ మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన నారాలోకేష్‌కు గిరిజన ఉద్యోగుల సంఘం తరపున శాభాకాంక్షలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. కొత్త ప్రభుత్వం ఎస్‌సి, ఎస్‌టి, బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ నిధులను గత ప్రభుత్వం వృధా చేసిందని, ఈ ప్రభుత్వం ఆ నిధులను మంజూరు చేసి ఎస్‌సి, ఎస్‌టిలకే ఖర్చు చేయాలని కోరారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దుపై హర్షం

ప్రజాశక్తి - నూజివీడు

గత ప్రభుత్వం అమలు చేయ తలపెట్టిన ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేసినందుకు నూజివీడు బార్ అసోసియేషన్ న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు సిఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.


రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

కామవరపుకోటలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - కామవరపుకోట

కామవరపుకోట శ్రీవీరభద్ర సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఏలూరు ఆశ్రమ హాస్పటల్ డాక్టర్లచే శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో గుండె, చెవి, ముక్కు, గొంతు సంబంధిత వ్యాధులు మోకాళ్ల నొప్పులు, నడుము నొప్పులు, కిడ్నీ జీర్ణాశయ, చర్మఎ కంటి సంబంధిత వ్యాధులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ సభ్యులు పత్తి పుల్లయ్య, గంటా జనార్దన్‌రావు, కెఎన్ఎస్.నరసింహరావు, నల్లూరి శివరామకృష్ణ, కొండూరు రామ్మోహన్‌రావు, బచ్చు ముత్యాలరావు, కొనకళ్ల అంజిబాబు, కొనకల్ల ప్రభాకరరావు, సింహాద్రి గుప్తా, చల్లారావు సహాయ సహకారాలు అందించారు.

నేరాలు - ఘోరాలు

వృద్ధుడు అదృశ్యం


శ్రీరామరాజు (ఫైల్)

ప్రజాశక్తి - ముదినేపల్లి

వృద్ధుడు అదృశ్యమైన సంఘటన మండలంలోని కాకరవాడ శివారు దేవరం గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... దేవరం గ్రామంలోని సూరిబాబు చేపల చెరువుపై గత కొంతకాలంగా దండు శ్రీరామరాజు కుటుంబంతో కాపురం ఉంటున్నాడు. ఈ నెల 13వ తేదీ గురువారం మధ్యాహ్న సమయంలో ఆవు తాడు తెంపుకొని వెళ్లగా, దానిని వెతికేందుకు వెళ్లిన శ్రీరామరాజు ఇంటికి తిరిగి రాలేదు. ఆవు ఇంటికి వచ్చింది గాని శ్రీరామరాజు అచూకీ తెలియరాలేదు. కుటుంబ సభ్యులు బంధువుల అన్ని చోట్ల గాలించినా ఆచూకీ తెలియరాకపోవడంతో శ్రీరామరాజు కుమారుడు దండు వెంకట సూర్యనారాయణ రాజు శనివారం తన తండ్రి కనిపించడం లేదంటూ ముదినేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

భయాందోళనలో ప్రజలు
తొలగించాలని వినతి


రోడ్డుకు అడ్డంగా ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ వైర్లు

ప్రజాశక్తి - ముదినేపల్లి

అక్రమంగా తవ్విన ఆక్వా చెరువులకు కొందరు బడా బాబులు ఇష్టారాజ్యంగా, నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్ వైర్లు ఏర్పాటు చేయడం పట్ల వణుదర్రు గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని కొత్తపల్లి నుంచి దేవపూడి వెళ్లే ఆర్ అండ్ బి రోడ్డు మార్గంలో ఆక్వా రైతులు బోయిన అప్పన్న, చిత్తజల్లు భాస్కరరావు, వీరంకి సూర్యచంద్రరావులు అక్రమంగా తవ్విన రొయ్యల చెరువులకు విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేసేందుకు నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్ వైర్లను ఏర్పాటు చేశారు. రొయ్యల చెరువుల వద్ద ఏర్పాటుచేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు వారి చెరువుల వరకు మెయిన్ వైర్లను సుమారు రెండు కిలోమీటర్ల మేర రోడ్డుకు ఇరువైపులా వేలాడ తీస్తూ విద్యుత్తును వినియోగించుకుంటున్నారు. ఈ రోడ్డులో భారీ వాహనాలు, ద్విచక్ర వాహనదారులు, ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఆక్వా చెరువులకు ఏర్పాటు చేసిన విద్యుత్ వైర్లు రోడ్డుకు అడ్డంగా కిందికి వేలాడుతున్నాయి. దీంతో ప్రజలు, వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు ఎప్పుడు ఏ వైరు తెగి మీద పడుతుందోననే భయాన్ని వ్యక్తం చేస్తున్నారు. అత్యంత ప్రమాదకరంగా ఉన్న ఈ విద్యుత్ వైర్లను వెంటనే తొలగించాలని, విద్యుత్ వైర్లను ఏర్పాటు చేసిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ వణుదురు గ్రామస్తులు విద్యుత్ ఎఇ పి.రవికుమార్‌కు వినతిపత్రం అందించినట్లు తెలిపారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలు : ఎంఎల్ఎ ధర్మరాజు

ప్రజాశక్తి - ఉంగుటూరు


ఉంగుటూరు : పుస్తకాలు అందిస్తున్న ఎంఎల్ఎ ధర్మరాజు

విద్యార్థులు నిరంతరం కష్టపడి బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు అన్నారు. ఉంగుటూరు జెడ్‌పి ఉన్నత పాఠశాలలో మండల స్థాయిలో జెడ్‌పి ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన పుస్తకాల కిట్ల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తాడేపల్లిగూడెం డివైఇఒ, ఉంగుటూరు మండల విద్యాశాఖాధికారి రవీంద్రభారతి అధ్యక్షత వహించారు. అనంతరం నేను బడికి పోతా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉంగుటూరు సర్పంచి బండారు సింధు, ఎంపిపి గంటా శ్రీలక్ష్మి, టిడిపి, బిజెపి నాయకులు పాతూరి విజయ్‌కుమార్, రెడ్డి చందు, శరణాల మాలతీరాణి, జనసేన మండలాధ్యక్షుడు పి.రాంబాబు, మండలంలోని జెడ్‌పి ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు. ఎంఎల్ఎగా గెలిచిన తర్వాత తొలిసారిగా ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొన్న ధర్మరాజు వివిధ శాఖల అధికారులు, రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తల నుంచి పెద్ద ఎత్తున స్వాగతం, అభినందనలు అందుకున్నారు.

భీమడోలు :విద్యార్థులు పాఠశాలలో శ్రద్ధగా విద్యను నేర్చుకోవాలని ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు అన్నారు. ఆయన శనివారం భీమడోలులో పర్యటించారు. దీనిలో భాగంగా భీమడోలు హైస్కూల్ వేదికగా నిర్వహించిన కార్యక్రమంలో స్టూడెంట్స్ కిట్ల పంపిణీలో భాగంగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు అందించారు. అనంతరం మండల విద్యాధికారులు శ్రీనివాసరావు, భాస్కర్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన నేను బడికి పోతా కార్యక్రమం ర్యాలీని భీమడోలులో ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళా విద్య వ్యాప్తికి ఆద్యులుగా భావించే సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలవేసి సత్కరించారు. భీమడోలు హైస్కూల్ ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు అహ్మద్ అధ్యక్షత నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పాఠశాలల అభివృద్ధి, విద్యాభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ జిల్లాస్థాయిలో విస్తీర్ణంలో, విద్యార్థుల సంఖ్యలో ప్రత్యేక గుర్తింపు పొందిన భీమడోలు హైస్కూల్ విద్యార్థులు భోజనాలు చేసేందుకు భోజనశాల, సైకిల్ స్టాండ్ నిర్మాణాలతో పాటు పాఠశాల ప్రవేశ మార్గాన్ని సీసీ రోడ్డుగా మార్చాలని కోరారు.

నిడమర్రు : మండల కేంద్రమైన నిడమర్రు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎంఎల్ఎ ధర్మరాజు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంగారు భవితకు చదువు ఒక్కటే మార్గమన్నారు. అందరూ శ్రద్ధగా చదువుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ హోదాల్లో ఉన్న స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలు పాఠశాలల్లోనే ఉండాలి

పలుచోట్ల నేను బడికి పోతా కార్యక్రమం


టి.నరసాపురంలో...


జీలుగుమిల్లిలో....

ప్రజాశక్తి - టి.నరసాపురం

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలో టి.నరసాపురం, బొర్రంపాలెం పలు ప్రభుత్వ పాఠశాలల్లో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారి టి.రామ్మూర్తి, ఎస్ కళ్యాణి మాట్లాడుతూ బడి ఈడు పిల్లలు పనిలో కాకుండా బడిలో ఉండాలనే నినాదంతో అవగాహన కార్యక్రమం నిర్వహించామన్నారు. ఈ నెల 13వ తేదీ నుంచి జులై 12 వరకు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నేను బడికి పోతా కార్యక్రమం నిర్వహించి బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి వారిని తిరిగి పాఠశాలలో చేర్పించడం కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. పాఠశాలలో నమోదుకాని పిల్లలను గుర్తించడం మొదలైన రోజువారీ కార్యక్రమాలు మండలంలోని ప్రతి పాఠశాల స్థాయిల్లో జరుగుతున్నాయని తెలిపారు.

కైకలూరు : జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఎంఇఒలు సిబ్బందితో కలిసి నేడు బడికి పోతా కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు మంగళవారం ఎంఎల్ఎ కామినేని శ్రీనివాస్ కిట్లు పంపిణ చేయనున్నారని తెలిపారు. మండల స్థాయిలో జరిగే ఈ కార్యక్రమానికి నాయకులు, అధికారులు, తల్లిదండ్రులు విచ్చేసి జయప్రదం చేయాలని కోరారు.

జీలుగుమిల్లి :బడి ఈడు పిల్లలందర్ని బడిలో చేర్పించి బడి బయట పిల్లలు లేని గ్రామంగా చేయడమే లక్ష్యంగా నేను బడికి పోతా కార్యక్రమాన్ని ప్రవేశపెట్టినట్లు మండల విద్యాశాఖాధికారి కె.శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులచే అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో బడి బయట ఉన్న పిల్లల్ని గుర్తించి వారిని బడిలో చేర్పించి వారికి నాణ్యమైన విద్యతో పాటు విద్యా ప్రోత్సాహకాలు అందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. చిన్న వయసులో పిల్లలకు విద్యను అందించడం ద్వారా మంచి సామర్థ్య విలువలు పెంపొందించుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కెఎం.మంగతాయారు, ఎంఇఒ-2 ఎస్.బుచ్చయ్య, ప్రధానోపాధ్యాయురాలు టి.చంద్రావతి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం టౌన్ :నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా జంగారెడ్డిగూడెం బాయ్స్ హైస్కూల్ విద్యార్థులు శనివారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ కె.అద్దయ్య మాట్లాడుతూ 18 ఏళ్ల లోపు పిల్లలు పాఠశాలలో ఉండాలని, వారిని పనిలో పెట్టుకుంటే కఠిన శిక్షలు ఉన్నాయని చెప్పారు. తహసీల్దార్ స్లీవజోజి మాట్లాడుతూ రెవెన్యూ శాఖ తరపున ఈ కార్యక్రమానికి పూర్తిగా సహకారం అందిస్తామన్నారు. ఎంఇఒ-1 రాముడు, ఎంఇఒ-2 జి.రాములు, కమిషనర్ నరేంద్రకుమార్, ప్రధానోపాధ్యాయులు లోవకుమారి మాట్లాడారు. జంగారెడ్డిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో శనివారం నేను బడికి పోతా కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలో ప్రధాన వీధుల్లో తిరుగుతూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ, ఎంఇఒ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నూజివీడు : అన్నే రామకృష్ణయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గొల్లపల్లి, మీర్జాపురంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు నేను బడికి పోతా కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమం జూన్ 13వ తేదీ నుంచి జులై 12వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు నూజివీడు ఉప విద్యాశాఖాధికారి సేవియా తెలిపారు. కార్యక్రమంలో భాగంగా గ్రామ వీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సేవియా మాట్లాడుతూ ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధిని సాధించడం విద్య ద్వారా సాధ్యమవుతుందన్నారు. ఆడపిల్లల చదువు సమాజానికి, దేశానికి ఎంతో అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాధికారాణి, ఉపాధ్యాయులు రవీంద్ర, జల్లు లక్ష్మి, మల్లేశ్వరి, కృష్ణవేణి, కోటేశ్వరమ్మ, సౌజన్య, మనోహరం, విఠల్ బాబు, మోహన్‌రావు, రంగారావు, పుల్లారావు, నాన్ టీచింగ్ సిబ్బంది రవి, నారాయణ, మరియమ్మ పాల్గొన్నారు.

ఆగిరిపల్లి : బాలికా విద్య, బాలికా సాధికారత పట్ల ప్రతిఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని ఆగిరిపల్లి తహశీల్దార్ బండి మృత్యుంజయరావు కోరారు. నేను బడికిపోతా కార్యక్రమంలో భాగంగా ఆగిరిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో బడి ఉత్సవం-బాలికా ఉత్సవం కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు కె.సర్వేశ్వరరావు, కె.ఆనంద్‌కుమార్, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్, ప్రధానోపాధ్యాయిని పి.పుష్పలత, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

చాట్రాయి : మండలంలోని తుమ్మగూడెం ఎంపిపిఎస్ ఉర్దూ పాఠశాలలో బడికి పోతా కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంపా వెంకట్రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడపిల్లలు విద్యలో రాణించి అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.

కామవరపుకోట : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి చౌతన సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ జె.రమేష్ మాట్లాడుతూ బడి ఈడు పిల్లలను తప్పనిసరిగా పాఠశాలలో చేర్పించాలన్నారు. ఎంఇఒ డి.సుబ్బారావు మాట్లాడుతూ ఈ నెల 13వ తేదీ నుంచి జులై 12వ తేదీ వరకు నేను బడికి పోతా కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు.

బక్రీద్‌పై ముస్లిం సోదరులతో డిఎస్‌పి సమీక్ష

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు పోలీస్ సర్కిల్ కార్యాలయ పరిధిలోని ముస్లిం సోదరులకు ఏలూరు డిఎస్‌పి ఇ.శ్రీనివాసులు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ నెల 17వ తేదీన బక్రీద్ పండుగను నిర్వహించనున్న నేపథ్యంలో సర్కిల్ కార్యాలయంలో బక్రీదు పండుగ నిర్వహణపై ముస్లిం సోదరులు, పెద్దలతో శనివారం రాత్రి ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లిం సోదరుల మధ్య ఏమైనా విభేదాలు ఉంటే శాంతి పూర్వక వాతావరణంలో పెద్దల సమక్షంలో పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ మేరకు శాంతి కమిటీలు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో భీమడోలు సిఐ బిబి.రవికుమార్, ఎస్ఐ వై.సుధాకర్, భీమడోలు మజీద్ కమిటీ అధ్యక్షులు షేక్ హసేన పాల్గొన్నారు.

ముదినేపల్లి : ఎస్‌పి మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు డిఎస్‌పి కైకలూరు రూరల్ సిఐ ఉత్తర్వుల మేరకు శనివారం ముదినేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ డి.వెంకట్‌కుమార్ ముస్లిం సోదరులతో సమావేశం నిర్వహించారు. సోమవారం జరగబోవు బక్రీద్ పండగను పురస్కరించుకుని ముదినేపల్లి పరిసర ప్రాంతాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముస్లిం పెద్దలతో ఎస్ఐ ముస్లిం సోదరులకు కౌన్సెలింగ్ నిర్వహించి నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.


కృత్రిమ కాళ్లను అమర్చిన వారితో ద్రాక్షాయని

వికలాంగులకు కృత్రిమ అవయవాలు అందజేత

ఆగిరిపల్లి : పుట్టుకతో కాని, ప్రమాదం వల్ల కాని అంగవైకల్యం పొందిన వికలాంగులకు కృత్రిమ అవయవాలను అందించడం వల్ల వారిలో ఆత్మ విశ్వాసం పెంపొందించడంతో పాటు సాధారణ జీవితం గడిపేందుకు దోహద పడవచ్చని గుడివాడకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయిని లాగిశెట్టి ద్రాక్షాయని అన్నారు. మండల పరిధిలోని తోటపల్లి హీల్ కృత్రిమ అవయవకేంద్ర సహకారంతో భద్రాద్రి కొత్తగూడేనికి చెందిన చేతన్, ప్రకాశం జిల్లా ఒంగోలుకు చెందిన కొల్లూరి చెన్నకేశవలకు కృత్రిమ కాళ్లను ఆమె అందించారు. ఈ కార్యక్రమంలో హీల్ కార్యదర్శి తాతినేని లక్ష్మి, సిఇఒ కూరపాటి అజయ్ కుమార్, సన్నీజాన్, వరకుమార్ పాల్గొన్నారు.

కొడాలి వినోద్‌కు పలువురి అభినందన

ప్రజాశక్తి - ముదినేపల్లి

నియోజకవర్గ పోల్ మేనేజ్‌మెంట్ ఇన్‌ఛార్జి కొడాలి వినోద్‌కు అభినందనలు వెలువెత్తుతున్నాయి. కైకలూరు నియోజవర్గంలో కామినేని శ్రీనివాస్ విజయంలో కీలక పాత్ర పోషించిన వినోద్‌ను పలువురు అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్నారు. శనివారం ఎంఇఒ కె.నరేష్‌కుమార్, మండల విఆర్ఒల అసోసియేషన్ సభ్యులు, పలువురు పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు కలిసి అభినందనలు తెలిపారు.

అంగన్‌వాడీ పిల్లలకు పలకలు, పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని కృష్ణాపురంలో బంజారా భజరంగీ భేరి, భూక్యా గోపయ్య, సక్రమ్మ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో అంగన్వాడీ సెంటర్‌లో విద్యార్థులకు పలకలు, నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంఘ ప్రధాన కార్యదర్శి భూక్యా వేణు గోపాల్ మాట్లాడుతూ పిల్లల చదువులకు పునాదులు అంగన్వాడీ కేంద్రాలన్నారు. అమ్మ ఒడి నుంచి చదువుల బడికి వెళ్లే పిల్లలకు ఆటలు, పాటల ద్వారా విద్యాభ్యాసానికి పునాదులు అంగన్వాడీలోనే పడతాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి జరభల పూర్ణయ్య నాయక్, అంగన్వాడీ టీచర్ హెచ్.రాములమ్మ, హెల్పర్ బి.ధనలక్ష్మి, సంఘ నాయకులు జరభల చందా నాయక్, హసావత్ వెంకటేశ్వరావు, ఎల్.నాగేంద్ర, జె.యుగంధర్, ఎల్.సాయి పాల్గొన్నారు.


పలకలు, పుస్తకాలతో చిన్నారులు

పే స్లిప్పులు అందించేందుకు చర్యలు

ఎంపిడిఒ స్వర్ణభారతి

ప్రజాశక్తి - కామవరపుకోట

మండలంలోని ఉప్పలపాడు, రామన్నపాలెం గ్రామాల్లో ఉపాధి హామీ కూలీలకు పే స్లిప్పులు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేశామని ఎంపిడిఒ జె.స్వర్ణభారతి తెలిపారు. ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మండలంలోని ఆయా గ్రామాల్లో పర్యటించి డిమాండ్ చేశారు. దీంతో ఎంపిడిఒ స్పందించారు. గత నెల 26వ తేదీ వరకు కూలీలకు వేతనలు చెల్లించినట్లు చెప్పారు. మండలంలో గత మూడు నెలలుగా అన్ని గ్రామ పంచాయతీల్లో పనులు జరుగుతున్నాయని, ప్రస్తుతం ఉప్పలపాడు పంచాయతీలో 330, రామన్నపాలెం పంచాయతీలో 270 మంది కూలీలు పని చేస్తున్నారని తెలిపారు. మండలంలో అన్ని పంచాయతీల నుంచి కొత్త జాబ్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నవారికి మంజూరు చేస్తామని తెలిపారు.

బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని గూటాల గ్రామంలో నూతనంగా నిర్మించిన బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని శనివారం నిర్వహించారు. జిల్లా ఎంపిపి సంఘాల అధ్యక్షుడు, పోలవరం ఎంపిపి సుంకర వెంకటరెడ్డి, ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపకులు, రాష్ట్ర అధ్యక్షులు బుంగా సంజయ్ ముఖ్య అతిథులుగా హాజరై విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గూటాల సర్పంచి ప్రసాద్, టిడిపి మండల మాజీ అధ్యక్షులు పాపోలు గణపతి రత్తయ్య, తెలుగు యువత అధ్యక్షులు పెద్దేహపు సత్యనారాయణ, వైసిపి సీనియర్ నాయకులు మైగాపుల దుర్గాప్రసాద్, బాబు జగ్జీవన్‌రామ్ యూత్ సభ్యులు దిగుమర్తి ఆనందరావు, నిండుకొండ మోహనరావు, జొన్నకూటి చిన్ని, దిగుమర్తి వెంకటరావు, దిగుమర్తి జెట్టియ్యా, దిగుమర్తి సతీష్, దిగుమర్తి గోపీ, దిగుమర్తి సామ్యూల్, దిగుమర్తి సుభాష్, దిగుమర్తి తేజ పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన కుర్సం దుర్గారావు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ ఐక్య కార్యాచరణ కమిటీ వైస్ ఛైర్మన్ కుర్సం దుర్గారావు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆదివాసీ ఉపాధ్యాయుల జీవనాడి జిఒ-3 గురించి, పోలవరం నిర్వాసితుల సమస్యల గురించి విన్నవించారు. అనంతరం హోంశాఖ మంత్రి వంగలపూడి అనితను, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును మర్యాద పూర్వకంగా కలిసి పలు సమస్యల గురించి వివరించారు. ఆయనతో పాటు ఎస్‌టి సెల్ వైస్ ప్రెసిడెంట్ బి.విజయ్ కుమార్, ఎస్‌టి సెల్ ప్రెసిడెంట్ సివేరి దొన్నుదొర పాల్గొన్నారు.

'హామీల అమలుపై కూటమి దృష్టి'

ప్రజాశక్తి - చింతలపూడి

సిఎం చంద్రబాబు ఎన్నికలు ముందు ఇచ్చిన హామీల ప్రకారం ఐదు ఫైళ్లపై సంతకాలు చేశారని టిడిపి చింతలపూడి నియోజకవర్గ మాజీ కన్వీనర్ జగ్గవరపు ముత్తారెడ్డి అన్నారు. పట్టణంలోని టిడిపి కార్యాలయం వద్ద శనివారం ఆయన మాట్లాడుతూ కూటమి ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వం దృష్టి పెట్టిందన్నారు. పెన్షన్ల పెంపుపై వృద్ధులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కొండ్రు దేవా, టిడిపి నాయకులు కొత్తపల్లి శేషగిరిరావు, మాజీ ఎంపిటిసి రాజా పాల్గొన్నారు.

జనసేనలో చేరిక

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

స్థానిక 42వ డివిజన్ పరిధిలోని కొత్తపేట ఏరియా నుంచి డివిజన్ ఇన్‌ఛార్జి అగ్గాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో వైసిపికి చెందిన సుమారు 50 మంది కార్యకర్తలు శనివారం జనసేనన చేరారు. పవర్‌పేటలో ఉన్న జనసేన పార్టీ కార్యాలయంలో జనసేన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల అధికార ప్రతినిధి, ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి రెడ్డి అప్పలనాయుడు వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదారంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.